ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల తొలగింపు


ఇంజాపూర్‌లో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

హయత్‌నగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లోని ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 199లో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులు గురువారం జేసీబీతో కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని గురువారం గ్రామస్థులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ ఇంద్రాణి ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి వెళ్లి అక్రమ నిర్మాణాలను గుర్తించి నేలమట్టం చేశారు. కొన్ని నెలలుగా కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. మండల సిబ్బంది పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హయత్‌నగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆదిత్యనగర్‌కాలనీలో నూటికి నూరు శాతం సీసీ రోడ్ల నిర్మాణం జరిగిందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. గురువారం ఆదిత్యనగర్‌లో రూ.22లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కాలనీవాసులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఆదిత్యనగర్‌లో అన్ని రోడ్లను సీసీగా మార్చడం జరిగిందన్నారు. దశలవారీగా మిగతా కాలనీల్లో రోడ్లు నిర్మిస్తామన్నారు. టెండర్లు పూర్తి అయిన పనులు ఒక్కొక్కటి పూర్తి చేస్తున్నామని అన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు లెవల్స్‌ను పరిశీలించి రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కృష్ణ, రాజేంద్రప్రసాద్, మురళీధర్‌రెడ్డి, భిక్షపతి, రామకృష్ణ, చంద్రశేఖర్, వెంకటేష్, బలరాం, శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు 'రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్'పై అవగాహన


రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్‌పై శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

మన్సూరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్(రియా) అనే అంశంపై గురువారం అవగాహన కల్పించారు. సోహం అకాడమి ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ వారి ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన 69 మంది బాలికలు, 66 మంది బాలురకు రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలపై శిక్షణనిచ్చారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.గీత, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ శోభ, సోహం టీంలీడర్ పవన్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

చిత్రకారులను కళాకారులుగా గుర్తించండి

మన్సూరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సకల కళాకారుల్లో ఒకరైన చిత్రకారులను కూడా కళాకారులుగా గుర్తించాలని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో తమ కమిటీలోని చిత్రకారులు ఎలాంటి బెదిరింపులకు లొంగకుండా అన్నింటిని తట్టుకుని ఆంధ్రప్రదేశ్ అని ఉన్న చోటల్లా తెలంగాణ రాష్ట్రం అని రాసి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారన్నారు. ముఖ్యంగా తమ కమిటీలోని గోరా శ్యాంసుందర్‌గౌడ్, యూసుఫ్ మహమ్మద్ అబ్దుల్, పి.రాకేష్‌గౌడ్, జిట్టా ఆయిల్ రెడ్డి, దేత్రే అమర్‌నాథ్, సామల రవి, అంతటి ధనుంజయ్యగౌడ్‌లు చిత్రకారులుగా ఉద్యమంగా కీలకంగా వ్యవహరించిన వారిలో ఉన్నారని, వీరిని కళాకారులుగా గుర్తించి వారికి అందే సదుపాయాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టండి


జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శ్వేతారెడ్డి

సైదాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి) : ఐఎస్‌సదన్ డివిజన్ డీఎస్‌నగర్‌లో పనులు చేయకుండానే రూ.53లక్షల నిధులు కాజేసేందుకు యత్నించిన ఘటనపై విచారణకు ఆదేశించాలని కోరుతూ ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు ఫిర్యాదు చేశారు. డీఎస్‌నగర్ నల్లపోచమ్మ ఆలయం నుంచి సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ వరకు వరద నీటి కాలువ నిర్మాణానికి జూన్ 2021లో రూ.90లక్షలు కేటాయించి టెండర్ ఖరారు చేశారని పేర్కొన్నారు. పనులు ప్రారంభించకుండానే కాంట్రాక్టర్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కుమ్మక్కై బోగస్ పత్రాలు, ఎంబీ బుక్కులు సృష్టించి రూ.53,59,330 నిధులు కాజేసేందుకు సిద్ధమయ్యారని వివరించారు. పనులపై పూర్తి విచారణ జరిపి సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు రూ.5.57కోట్లు మంజూరు

చంపాపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ఆయా కాలనీల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ.5.57కోట్లు మంజూరైనట్లు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ తెలిపారు. గురువారం జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ నిధుల మంజూరుకు సభ్యుల ఆమోదం తెలిపినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. డివిజన్‌లోని టీకేఆర్ కమాన్ రోడ్ నుంచి గ్రీన్‌ల్యాండ్స్‌కాలనీ, వందనపురి కాలనీ మీదుగా సాగర్ ఎన్‌క్లేవ్(అలేఖ్యా టవర్) వరకు సీసీ రోడ్డు నిర్మాణం, హస్తినాపురం సౌత్ కాలనీలో ఫుట్‌పాత్ నిర్మాణం, షిరిడీసాయినగర్‌కాలనీ జడ్పీరోడ్ నుంచి హస్తినాపురం సెంట్రల్ సిగ్నల్ వరకు బీటీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్ సహకారంతో డివిజన్‌లోని ప్రతి కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న వీఎం హోమ్ పాఠశాల మేనేజ్‌మెంట్

సైక్లింగ్ అకాడమీకి విద్యార్థుల ఎంపిక

ఎల్బీనగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సైక్లింగ్ అకాడమీకి సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని విక్టోరియా మెమోరియల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో గురువారం విద్యార్థులను పాఠశాల సెక్రటరీ రామారావు, ప్రిన్సిపాల్ భాస్కర్, శ్రీనివాస్, సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓలాడ్రంలో అకాడమీకి తమ పాఠశాల విద్యార్థులు ఇ.పరమసింహ, డి.గాంధీ, ఇ.నితిన్‌లు ఎంపికవ్వడం సంతోషంగా ఉందని, వీరి ఎంపికలో కీలకపాత్ర పోషించిన పీఈటీలు జి.రవీందర్, గౌతమ్‌లను వారు అభినందించారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను శాలువాతో సత్కరించారు.

మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన ర్యాలీ

చాదర్‌ఘాట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సే నో టు డ్రగ్స్ అంటూ విద్యార్థుల్లారా నినదించండి అంటూ మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి విద్యార్థులతో నినాదాలు చేయించారు. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాలు వద్దు.. జీవితం ముద్దు అనే నినాదంతో అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో విద్యార్థులు ప్రధాన పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్ గురించి ఎవరైనా మాట్లాడినా, ప్రోత్సహించేందుకు ప్రయత్నించినా, అమ్ముతున్నా, వాడినట్లుగా గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి ప్రాథమిక దశలోనే డ్రగ్స్‌ను అంతం చేయడంలో విద్యార్థులు చేయూత నివ్వాలని ఏసీపీ విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్ బారిన పడి విద్యార్థులు తమ ఉజ్వలమైన భవితవ్యాన్ని నాశనం చేసుకోరాదన్నారు. ఆరోగ్యకరమైన జీవనంతో ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన సూచించారు. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ మాట్లాడుతూ డ్రగ్స్ నివారణకు విద్యార్థులు తమ వంతు సహకరించాలని అప్పుడే పూర్తిస్థాయిలో పారద్రోలగలుగుతామన్నారు. మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాలకు చెందిన జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొని సే నో టు డ్రగ్స్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.


అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి, పక్కన మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు

మజీద్‌పూర్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం మజీద్‌పూర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలను ఆరికట్టాలని విద్యార్థులు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలకు


మజీద్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అవంతి విద్యార్థులు

ముఖ్యంగా యువత దూరంగా ఉండాలన్నారు. అక్రమ రవాణా, కష్టాలో ఉన్న వారికి పని కల్పిస్తామని మోసం చేయడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 109, ఉమెన్ హెల్ప్‌లైన్ 1090లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కొహెడా సెక్టార్ సూపర్‌వైజర్ నాజీ, అరుణ, సరోజాతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

వనస్థలిపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వైద్య పరికరాలు అవసరం ఉందని, దీంతో పాటు కొన్ని చోట్ల మరమ్మతులు కూడా చేయించాలని, నర్సింగ్ కళాశాల కోసం భవనం కేటాయించాలని ఆస్పత్రి వైద్యులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆస్పత్రికి కావాల్సిన వైద్య పరికరాలు, అదనపు గదుల కేటాయింపు ఇతర అవసరాలను త్వరలోనే కల్పిస్తామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వారి వైద్యసేవలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, మందుల కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం ఆస్పత్రిలోని ఫార్మసీని


ఏరియా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

సందర్శించి ఆస్పత్రికి వచ్చే రోగులకు సరిపడ మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం వైద్య కళాశాల సూపరింటెండెంట్ నాగేందర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి, ఆర్ఎంఓ జయమాల, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చొరవతోనే ఎల్బీనగర్ అభివృద్ధి : మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించడం జరుగుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. గురువారం వనస్థలిపురం డివిజన్ హిల్ కాలనీలో సీసీ రోడ్డు పనులకు రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డిలతో కలిసి మధుయాష్కీగౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల విజ్ఞప్తి మేరకు ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రోను విస్తరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు. 250కోట్లతో ఎల్బీనగర్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత సంవత్సర కాలంలోనే వనస్థలిపురం డివిజన్‌కు సుమారు రూ.18కోట్ల నిధులు మంజూరు కావడంతో వనస్థలిపురం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ జీవించే విధంగా తమ కాలనీలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. కాలనీవాసులకు ఏ అవసరం వచ్చినా తనని


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మధుయాష్కీగౌడ్, మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

నిరంతరం సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్‌రెడ్డి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచి కృష్ణమోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, అశోక్‌గౌడ్, సత్యనారాయణ, కవిత, స్వర్ణమాధవి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ నాటి చీకటి రోజులు మరిచిపోలేం : నిరంజన్

సైదాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర భారతదేశంలో ఎమర్జెన్సీ చీకటి రోజులను జీవితంలో మరిచిపోలేమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్ అన్నారు. ఎస్‌బీహెచ్‌సీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఎమర్జెన్సీలో ప్రశ్నించే మేధావులు, పాత్రికేయుల గొంతు నొక్కారని, ఎన్నో సంస్థలను రద్దు చేశారని విమర్శించారు. భారతదేశ చరిత్రలో 1975 జూన్ 25 ఒక చీకటి రోజుగా నిలిచిపోయిందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్తకాపు అరుణారెడ్డి, జంగం శ్వేతారెడ్డి, బొక్క భాగ్యలక్ష్మి, భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ గజానంద్‌గౌడ్, నర్సింహ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్

డయేరియాపై అవగాహన కలిగి ఉండాలి : డాక్టర్ తరుణ్

చాదర్‌ఘాట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కలుషిత నీరు తాగినా, పాడైన ఆహారం తినడం ద్వారా అతిసార వ్యాధి(డయేరియా)కి గురవుతారని, వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శాలివాహననగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తరుణ్ తెలిపారు. గురువారం మూసారాంబాగ్, శాలివాహననగర్ కాలనీలోని శాలివాహననగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అతిసారవ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అతిసార వ్యాధికి గురైన రోగులు వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఈనెల 16నుంచి ప్రారంభమైన అతిసార వ్యాధి అవగాహన కార్యక్రమం జూలై 31వరకు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

శాలివాహననగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధికి


డయేరియా నివారణకు అవసరమైన మందులను పంపిణీ చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ తరుణ్

గురైన వారికి ఓఆర్ఎస్, జింక్ మందులను పంపిణీ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

గాంధీభవన్‌లో మలక్‌పేట కాంగ్రెస్ నేతల గందరగోళం

- నియోజకవర్గ సమావేశాలు, డివిజన్ల కమిటీలపై ఏకపక్ష నిర్ణయాలంటూ పార్టీ పరిశీలకులు, నగర అధ్యక్షుడిపైనే మాటలతో ఎదురుదాడికి యత్నం
- సైదాబాద్ డివిజన్‌కు చెందిన ఇద్దరు నాయకుల సస్పెన్షన్

చాదర్‌ఘాట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో గురువారం జరిగిన మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల సమావేశం గందరగోళంగా మారింది. మలక్‌పేట నియోజకవర్గ సమావేశాల నిర్వహణలో, డివిజన్ల కమిటీల ఏర్పాటులో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ పార్టీకి చెందిన సీనియర్ నాయకులను విస్మయిస్తున్నారంటూ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్‌వలీ ఉల్లా సమీర్, మలక్‌పేట పార్టీ పరిశీలకుడు టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, సుబ్రహ్మణ్యప్రసాద్‌లపై సైదాబాద్ డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు ఎదురు దాడికి దిగారు. ఇలా ఎదురు దాడికి దిగితే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానంటూ సైదాబాద్ డివిజన్‌కు చెందిన మలక్‌పేట ఏ బ్లాక్ అధ్యక్షుడు అముదాల మదన్‌బాబు, డివిజన్ మాజీ అధ్యక్షుడు గంట్ల కృష్ణను హెచ్చరించినా పట్టించుకోకుండా పార్టీకి, పార్టీ నాయకులపై పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. దీంతో ఆగ్రహించిన వలీ ఉల్లా సమీర్ విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ దృష్టికి, క్రమశిక్షణ సంఘం ఛైర్మన్, ఎంపీ మల్లు రవికి విషయాన్ని విన్నవించారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని సస్పెండ్ చేయాలంటూ ఆదేశించారు. ఈ మేరకు పార్టీ నాయకులు మదన్‌బాబు, గంట్ల కృష్ణలను సస్పెండ్ చేస్తూ నగర అధ్యక్షుడు వలీ ఉల్లా సమీర్ వెంటనే ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏమైనా చెప్పాలనుకుంటే బహిరంగంగా చెప్పుకోవచ్చని, తాము వాటిని ఓపిగ్గా విని, మలక్‌పేట నాయకులు, కార్యకర్తలందరి అభీష్టం మేరకే తాము నిర్ణయాలు తీసుకుంటామంటూ మహ్మద్ వలీ ఉల్లా సమీర్ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇటీవల మలక్‌పేటలోని డివిజన్ల వారిగా మలక్‌పేట పార్టీ ఇన్‌చార్జి షేక్ అక్బర్ ఏకపక్షంగా తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులతోనే సమావేశాలు నిర్వహించి మిగతా పార్టీ నాయకులను ఆహ్వానించకుండా విస్మరించారంటూ పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై పార్టీ పరిశీలకులు, నగర అధ్యక్షుడు నాయకులకు నచ్చజెప్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.


మదన్ బాబు


గంట్ల కృష్ణ

మలక్‌పేట కాంగ్రెస్ ఇన్‌చార్జి షేక్ అక్బర్, నగర అధ్యక్షుడు మహ్మద్ వలీ ఉల్లా సమీర్‌తో గురువారం గాంధీ భవన్‌లో సమావేశం నిర్వహించగా టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శులు చెకోలేకర్ శ్రీనివాస్, బొల్లు కిషన్, మక్సూద్ అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జి. బాలకృష్ణయాదవ్, డివిజన్ల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్‌గౌడ్, చక్రపాణి, రాహుల్‌సింగ్, షకీల్‌అహ్మద్, షాహిద్‌ఖాన్, మహేష్, నాయకులు బాబు శ్రీనివాస్, బద్దం సురేందర్‌రెడ్డి, మదన్‌బాబు, గంట్ల కృష్ణతో పాటు అనేక మంది కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభమైన కొద్ది సేపటికే మలక్‌పేటలో ఏ సమావేశం నిర్వహించినా సీనియర్ కార్యకర్తలకు సమాచారం ఇవ్వడం లేదంటూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన నగర అధ్యక్షుడు మహ్మద్ వలీ ఉల్లా సమీర్ పార్టీ కార్యకర్తలందరి అభిప్రాయం మేరకు మలక్‌పేటలో ఏ కమిటీ వేసినా నిర్ణయం తీసుకుంటామని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఆయన మాటలు పట్టించుకోకుండా సైదాబాద్ డివిజన్‌కు చెందిన మదన్‌బాబు, గంట్ల కృష్ణలు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేస్తూ పార్టీ పరిశీలకులు, మలక్‌పేట ఇన్‌చార్జి, నగర అధ్యక్షుడిపై ఎదురు దాడికి యత్నించారు. ఈ విషయాన్ని నగర అధ్యక్షుడు వలీ ఉల్లా సమీర్ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, క్రమ శిక్షణ కమిటీ ఛైర్మన్, ఎంపీ మల్లు రవి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారెవరైనా సరే సస్పెండ్ చేయాలంటూ ఆదేశించారు. ఈమేరకు నగర అధ్యక్షుడు వలీ ఉల్లా సమీర్ సైదాబాద్ డివిజన్‌కు చెందిన నాయకులు మదన్‌బాబు, గంట్ల కృష్ణలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరిని సస్పెండ్ చేస్తున్నట్లుగా అధికారికంగా ప్రకటన వెలువడగానే సమావేశానికి హాజరైన మిగతా నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారుగా నిశబ్ధంగా ఉండిపోయారు. పార్టీ కార్యక్రమాలకు కట్టుబడి పనిచేస్తామని ఎవరికి వారు నగర అధ్యక్షుడితో మాట్లాడి వెనుతిరిగినట్లు సమాచారం.

మాసబ్‌చెరువు కట్ట మైసమ్మకు తొలి బోనం

హయత్‌నగర్ : ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు కట్ట మైసమ్మకు స్థానిక కుమ్మరులు తొలి బోనం ఎక్కించారు. శశివర్ధన్ దంపతులు తొలిబోనం ఎక్కించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్‌తో పాటు కుమ్మరులు పాల్గొనారు.

భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, పార్కు స్థలాల పరిశీలన

హయత్‌నగర్ : వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి మునగనూర్ గ్రామంలోని రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, పార్కు స్థలాలను పరిశీలించాడు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు వినయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

చైతన్యకుమార్‌కు శుభాకాంక్షలు



సైదాబాద్ : సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చైతన్యకుమార్‌ను గురువారం చంచల్‌గూడలోని ప్రభుత్వ ముద్రణాలయం ఉద్యోగ జేఏసీ నేత శ్రీనివాస్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు ముఖేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.


టీపీసీసీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్, ఎంపీ మల్లు రవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కిషన్‌సింగ్, షకీల్, డివిజన్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌గౌడ్. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

ఆపరేషన్ సింధూర్‌లో ప్రాణాలు కోల్పోవడం బాధాకరం



మురళీనాయక్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్

చంపాపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌లో మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అని మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. కర్మన్‌ఘాట్ గాయత్రీనగర్ చౌరస్తాలోని స్థానిక ఉత్పత్తుల కేంద్రం(ఎల్‌పీడీఓ)లో గురువారం ఏర్పాటు చేసిన మురళీనాయక్ బ్లాక్‌ను ముఖ్య అతిథిగా ఇన్‌స్పెక్టర్ హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ అతి చిన్న వయస్సులో మురళీనాయక్ దేశం కోసం ప్రాణాలు అర్పించడం, ఆయన జ్ఞాపకాలను గుర్తుంచుకునేందుకు ఈ బ్లాక్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్‌పీడీఓ ఛైర్మన్ భరత్ సంపం, చిరంజీవి, సాయితేజ, ప్రభాకర్‌రావు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఏబీవీపీ దిల్‌సుఖ్‌నగర్ జిల్లా కన్వీనర్‌గా గంగాధర్



చాదర్‌ఘాట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ దిల్‌సుఖ్‌నగర్ జిల్లా కన్వీనర్‌గా గంగాధర్ నియమితులయ్యారు. ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన ఏబీవీపీ తెలంగాణ ప్రాంత అభ్యాస్ వర్గలో ఈ మేరకు గంగాధర్‌ను నియమించినట్లుగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి ప్రకటించినట్లు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అక్కారీ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో దిల్‌సుఖ్‌నగర్ కన్వీనర్‌గా నియమించి తన బాధ్యతను మరింత పెంచారన్నారు. రాష్ట్రంలోని విద్యారంగ సమస్యపై రాజీలేని పోరాటం చేస్తానని ఆయన ప్రకటించారు. ముఖ్యంగా కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్య అమలు కోసం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఫీజుల చట్టం, ప్రభుత్వ విద్యా సంస్థలో ఉన్న అన్ని విభాగాల్లో ఉన్న ఖాళీల భర్తీకి రాజీలేని పోరాటం చేస్తానని తెలిపారు.

వారాహిదేవి నవరాత్రులు ప్రారంభం

ఎల్బీనగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్ పరిధిలోని కుర్తాళపీఠం ప్రత్యంగిరాదేవి ఆలయంలో గురువారం వారాహిమాత నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీఠాధిపతులు సిద్ధేశ్వరానందభారతి మహాస్వామి, ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతి మహాస్వామి వార్ల ఆశీస్సులతో ఈ వేడుకలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మొదటి రోజు వారాహి అమ్మవారికి 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలో జంట నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా రుద్ర హోమం

కొత్తపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్నేహపురికాలనీలో వెలసిన పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఉపాలయంలో గురువారం ఉదయం స్వామివారికి శాస్త్రోక్తంగా ఏకవార రుద్రాభిషేకం చేశారు. అనంతరం అర్చక స్వాములు వేదమంత్రాల మధ్య రుద్ర హోమం నిర్వహించారు. పరిసర కాలనీల భక్తులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా కోర్టులో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కర్ణకుమార్, 13వ అదనపు జిల్లా అండ్ సెషన్ జడ్జి వాణి, న్యాయవాదులకు బీపీ, షుగర్ ఇతర వైద్య పరీక్షలను ఉచితంగా చేసి పలు వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సేరి ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొసెట్టి కార్తీక్, మహిళా సభ్యులు పలుసం అనసూయ, పి.మౌనిక, సీనియర్ న్యాయవాదులు గుర్రం సుధాకర్‌రెడ్డి, ధన్వాడ మధుసూదన్‌రావు, రాజేశ్వరరావు, ఎస్ .సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.